

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33(ఆదివారం)
కనిష్ఠం : 29

అపార సహజ వాయువు, చమురు నిక్షేపాలను రక్షించుకోవాలి 7

» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

నాయకా.. కదలాలిక!

ఐదేళ్లయినా కుర్చీ వదలని పలువురు ఉద్యోగులు



గవర్నమెంట్ ఐటీఐలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి అదే ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో పనిచేసి.. తిరిగి మళ్లీ ఐటీఐ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. తాజాగా యూనియన్‌లో చేరి మరో నాలుగేళ్లు ఇక్కడే పనిచేసేందుకు స్కెచ్ వేశారు. ఇలా దాదాపు అన్ని విభాగాల్లోని నాయకులు ఈ పాత చింతకాయలాంటి జీవోను పట్టుకుని మరి కొన్నేళ్ల పాటు కార్యాలయంలో చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇటువంటి వారికి కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికత ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో పారదర్శకత కొరవడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని శాఖల్లో కుర్చీలను వదిలేందుకు ఇష్టపడని కొందరు ఉద్యోగులు 'పాత'దారులు వెతుక్కుంటున్నారు.ఎలాగైనా అదే శాఖలో మళ్లీ తిష్టవేయాలని ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులను, జీవోలను పక్కన పెట్టి కాలం చెల్లిన పాత జీవోలను తెరపైకి తెస్తున్నారు. ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయి రాజకీయం చేస్తున్న కొందరు..ఉద్యోగ సంఘాల నాయకులమనే పేరుతో బదిలీలకు బ్రేక్‌లు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి.

సీటు అందుకే..

చాలా మంది ఉద్యోగులు బదిలీ అయి వెళ్లడానికి అంగీకరించరు.. ఏదో రకంగా కుర్చీకి అతుక్కుపోవడానికే చూస్తారు.. ఎందుకంటే ఆ సీటుకు ఉన్న డిమాండ్ అటువంటిది.. బాగా ఆదాయవనరు ఉన్న సీటుకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. రూ.లక్షలు పోసి ఆ సీటు సంపాదిస్తారు. అటువంటి సీటును కాపాడుకోవడానికి ఉద్యోగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఖజానా తదితర విభాగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదే జరుగుతోంది.. డిమాండ్ ఉన్న సీటును కాపాడుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సీట్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశమూ ఉంటుంది.

ఈ నెల 31 వరకు గడువు..

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2025 మే 31 నాటికి ఒక స్టేషన్లో ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని సూచించింది.ఒక స్టేషన్లో (అంటే కార్యాలయం లేదా సంస్థ కాదు. వాస్తవంగా పని చేసే ప్రదేశం(నగరం, పట్టణం, గ్రామం) ఐదేళ్లు పూర్తి చేసిన వారే కాకుండా ఇతర ఉద్యో గులు వ్యక్తిగత అభ్యర్థన మేరకు బదిలీకి అర్హులు. అటువంటి ఉద్యోగులందరికీ ప్రాధాన్యమివ్వాలి. ఇందులో ఆయా ఉద్యోగ సంఘాల్లో పనిచేసిన వారికి కొంత వెసులుబాటు ఉంది. వారు అదనంగా మరో నాలుగేళ్లు అంటే తొమ్మిదేళ్ల పాటు వారు ఒకే స్టేషన్లో పనిచేయవచ్చు. తొమ్మిదేళ్ల పూర్తయ్యాక కచ్చితంగా బదిలీ చేయాలి.

ఉద్యోగుల ప్రయత్నాలు..

ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పనిచేసిన ప్రతి ఉద్యోగిని కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 500 నుంచి 700 మంది బదిలీ కావొచ్చని అంచనా.ఎందుకంటే గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారు కదలాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని విభాగాల్లో దాదాపు ఐదేళ్ల దాటిన వారే

» ఏళ్లుగా తిష్ట వేసిన ఉద్యోగులు
» పదేళ్లయినా సీటు వీడని వైనం
» కదిలేందుకు అనాసక్తత
» ఉద్యోగ సంఘాల్లో చేరిక
» పలు ఆఫీసుల్లో ఇదే పరిస్థితి
» ప్రభుత్వ ఉత్తర్వులతో షాక్
» బదిలీలకు ఐదు రోజులే గడువు

కాదు.. 7-10 ఏళ్లకు పైగా ఒకే స్టేషన్లో తిష్టవేసి రాజకీయాలు చేస్తున్న వారూ ఉన్నారు. ముఖ్యంగా ఉద్యోగ సంఘాల పేరుతో తమ బదిలీలను నిలుపుదల చేసుకుంటూ కొందరు వస్తున్నారు. సంఘాల్లో ఉండే నాయకులకు ఐదేళ్లతో పాటు మరో నాలుగేళ్లు కలిపి సుమారు తొమ్మిదేళ్ల పాటు ఒకే స్టేషన్లో పనిచేసే అవ కాశం ఉంది. ప్రస్తుతం కొన్ని శాఖల్లోని ఉద్యోగులు కొందరు సంఘ నేతలుగా అవతారమెత్తి బదిలీ కా కుండా చూసుకుంటున్నారు.ఈ మేరకు కొందరు ఉద్యోగులు రెండు,మూడు నెలల కిందట డబ్బు లు కట్టి ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా చేరిపోయారు. ఎగ్జిక్యూటివ్ పదవులు దక్కించుకున్నారు.తాము యూనియన్లలో ఉన్నామని తమ కు బదిలీలు వర్తించబోవని తప్పించుకుంటున్నారు. ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉండే ప్రభుత్వ ఐటీఐ, టెక్నికల్ ఆర్‌జేడీ,జిల్లా ఉపాధి కార్యాలయాల్లోని పలువురు ఉద్యోగులు సీట్లకు అతుక్కుపోయేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.2012 నాటి సర్క్యులర్ మెమోను చూపించి బదిలీ నుంచి తప్పించుకునేందుకు ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

సీఎస్ చెక్ పెట్టారిలా..

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ విడుదల చేసిన సర్క్యులర్ మెమో ఇలాంటి నేతల ఆటలకు చెక్ పెట్టినట్టయ్యింది. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీ మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధిపతులు, కలెక్టర్లు, జిల్లా మెజిస్ట్రేట్ల అసోసియేషన్ల నుంచి నిర్ణీత పత్రాలను పొందాలని ప్రభుత్వం సూచించింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ పదవి, పదవీకాలం తదితర విషయాలు అసోసియేషన్ ఉపచట్టాల్లో కవర్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించాలని,వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో తదితర అన్ని విషయాలను ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే సాధారణ బదిలీల్లో మినహాయింపు వర్తింపజేయాలని సూచించారు. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది.



పుష్కలంగా నిధులు..

పుష్కరాలకు పనులయ్యేనా!

నేటికీ కదలని అఖండ గోదావరి ప్రాజెక్టు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరి ప్రాజెక్టుకు పుష్కలంగా నిధులు వచ్చినా.. పనులు ఆరంభించడంలో అధికారులు జాప్యం చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత పుష్కరాల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా బోటు మీద గోదావరి నదిలో పయ నించి పర్యాటరంగానికి ఇది చాలా అనువైన ప్రాంతమని భావించారు. వెంటనే అఖండ గోదావరి ప్రాజెక్టు పేరిట రూ.100కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అఖండ గోదావరి టూరిజానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు అనుకున్నదే తడవుగా రీజినల్ కార్యాలయం పెట్టారు. అధికారినీ నియమించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి, హేవలాక్ బ్రిడ్జిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ఉపక్రమించారు. కానీ తర్వాత ప్రభుత్వం మారడంతో అఖండగోదావరి ప్రాజెక్టుతో పాటు కార్యాలయం ఎత్తేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయంతో చంద్రబాబు నాయకత్వంలో కూటమి విజయం సాధించడం, ఆయన ముఖ్యమంత్రి కావడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ అఖండ గోదావరికి ప్రాణం పోశారు. పైగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా రాజమహేంద్రవరానికి చెందిన కందుల దుర్గేష్ ఉన్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ సాసాతో రూ.94కోట్లు మంజూరు చేశారు. నిధులు వచ్చేశాయి. ఈ ప్రాజెక్టు కింద రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌ను ఆధ్యాత్మికంగా, పర్యాటక కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లు సిద్ధమైనట్టు సమాచారం. ఇటీవల టెండర్లు ఖరారు చేశారు. ఇక్కడ మ్యూజిక్ టవర్, నక్షత్ర స్తంభం, ఓం సింబల్, నదిలో నీళ్లు తాగుతున్నట్టు ఏనుగు విగ్రహాలు.. పలు అభివృద్ధి పనులు చేయనున్నారు. నిధులున్నా ఇంకా పనులు ఆరంభించలేదు. వచ్చేది వర్షాకాలం కావడంతో పుష్కరఘాట్‌లో పనులకు ఆటంకం కలుగుతుంది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జిని పర్యాటక కట్టడంగా అభివృద్ధి చేయడం, కడియం నర్సరీల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, కడియపులంక కాలువలో బోట్ షికారు, నిడదవోలు కోట సత్తెమ్మ గుడివద్ద భక్తుల వసతి భవనం పనులు ఉన్నాయి. ఇంకా టెండర్లు పిలవలేదు. పనులైతేనే పుష్కరాల నాటికి ప్రభుత్వం భావించినట్లు అభివృద్ధి కనిపిస్తుంది.

» రూ.94 కోట్ల నిధులు విడుదల
» పుష్కరఘాట్‌కు టెండర్ ఖరారు
» అభివృద్ధికి ఎదురుచూపులు
» అయినా ఆరంభంకాని పనులు
» అఖండ గోదావరి ప్రాజెక్టు జాప్యం
» పట్టించుకోని అధికారులు

మహా..సందడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పసుపు పండుగకు జనం సన్నద్ధమయ్యారు.. తండోపతండాలుగా నాయకులు.. కార్యకర్తలు తరలివెళ్లేలా నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కడపలో ఈ నెల 27,28,29 తేదీల్లో టీడీపీ మహానాడు పండుగ నిర్వహించనున్నారు. ఆ పండుగలో భాగస్వామ్యం కావడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పసుపు దండు కదలనుంది. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాలనుంచి ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల నాయకత్వంలో వేలాదిగా తరలివెళ్లనున్నారు. ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో మహానాడుతోపాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటగా జరగబోయే ఈ మహానాడు కడపలో బ్రహ్మాండంగా నిర్వహించనున్నారు. వైసీపీ అధినేత జగన్‌కు అడ్డాగా ఉన్న కడపలో టీడీపీ గత ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఇవాళ మహానాడు ఘనంగా నిర్వహించడం ద్వారా అక్కడ తమ సత్తా ఏంటో చూపాలనేది టీడీపీ వ్యూహంగా కనిపిస్తోంది. మహానాడు నిర్వహణకు 19కమిటీలు నియమించిన సంగతి తెలిసిందే. అందులో ముఖ్యమైన తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు వ్యవహరించడంతోపాటు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. పలు కమిటీల్లో మన ప్రాంత నేతలు కొందరు నేతలు సభ్యులుగా నియమితులయ్యారు. కార్యకర్తలకు కొంతమందికి ఇప్పటికే నామినేటెడ్ పదవులు దక్కాయి. వందలాది పోస్టులు రానున్నాయి. ఈ నేపథ్యంలో మహానాడులో పాల్గొనడానికి టీడీపీ శ్రేణులు బాగా ఉత్సాహ పడుతున్నాయి. గత వైసీపీ అరాచక పాలననుంచి బయటపడిన ఆనందంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోను మహానాడు సన్నాహక సభలు పెట్టుకోవడంతోపాటు జిల్లాల మినీమహానాడు ఘనంగా నిర్వహి ంచిన సంగతి తెలిసిందే. అందరిలోనూ జోష్ పెరిగింది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మహానాడులో కచ్చితంగా పాల్గొనాలనే ఆలోచనతో అమెరికా టూర్‌ను మధ్యలోనే ఆపుకుని రావడం గమనార్హం. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ పసుపుదండు ఛలో మహానాడు అంటూ బయలుదేరనుంది.

» రేపటి నుంచి మహానాడు
» ఉమ్మడి జిల్లా నుంచి సన్నద్ధం
» నేడు కడపకు టీడీపీ నేతల క్యూ
» కార్యకర్తలు,అభిమానుల సమీకరణ
» నియోజకవర్గాల వారీ ఏర్పాట్లు
» బస్‌లు, కార్లలో తరలింపు
» ప్రత్యేకంగా విందు ఏర్పాట్లు



అమరావతిలో మహానాడుపై చర్చిస్తున్న మంత్రి సుభాష్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

కడప 950 కి.మీ

ఈ మేరకు నాయకులు ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి కడపకు 950 కిలోమీటర్లు.. కాకినాడ, కోనసీమ నుంచి వెయ్యి కిలోమీటర్లు దాటి ఉంటుంది.రోడ్డు మార్గాన వెళ్లాలంటే 9 గంటలు పైనే పడుతుంది. ఈ నేపథ్యంలో ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం స్నాక్స్. రాత్రికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీన ఉదయం నుంచే మహానాడు కార్యక్రమం ఆరంభిస్తారు. సమయానికి అక్కడకు చేరుకునేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలవారీగా వెళ్లేలా ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేశారు.



కడపలో మహానాడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం 7

నిర్లక్ష్యమే శాపం



అమలాపురం చిన్నవంతెన వద్ద కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

» రైతుల పాలిట దుఃఖదాయినిగా 'కుమ్మరికాల్వ' మేజర్ డ్రెయిన్
» ఏటా ముంపు బారిన పడుతున్న వేలాది ఎకరాల పంట పొలాలు
» మేటలు పెరిగిపోయి రివర్స్ ఫ్లో
» నిధులు మంజూరయ్యేనా?

ఆంధ్రజ్యోతి-అమలాపురం రూరల్:

పంట పొలాల్లోని ముంపు నీరుదిగాల్సిన మేజర్‌డ్రెయిన్ అది. దశాబ్దంన్నర కాలంగా కనీస అభివృద్ధిపనులు లేక ఏటా వేలాదిఎకరాల పంట భూములు ముంపు బారిన పడుతున్నాయి. అమలాపురం నడిబొడ్డునుంచి ముందుకు పారే కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్ ఏటా రైతుల పాలిట దుఃఖదాయినిగా మారిపోయింది. దీనికితోడు డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న పలు కాలనీలు రోజుల తరబడి ముంపులోనే మగ్గాల్సిన పరిస్థితి. ఈసారైనాడ్రెయిన్‌లో పేరుకుపోయిన మేటలు తొలగించడంతోపాటు గుర్రపుడెక్క, తూడును నిర్మూలిస్తే రైతులకే కాదు సమీప కాలనీల ప్రజలకు మేలు చేకూర్చినవారవుతారు.

18వేల ఎకరాల ఆయకట్టుకు ఆధారం

అంబాజీపేట మండలం ముక్కామలలో ప్రారంభమైన కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్ అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాలు, అమలాపురం పట్టణం మీదుగా అల్లవరం మండలం బోడసకుర్రు వరకు విస్తరించి ఉంది. 24 కిలోమీటర్ల పొడవున ప్రవహించే కుమ్మరికాల్వ డ్రెయిన్‌ను ఆనుకుని 18వేల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. వాటిని ఆనుకుని ఎన్నో కాలనీలున్నాయి. 2011లో ఈ మేజర్ డ్రెయిన్‌కు అభివృద్ధి పనులుచేశారు. అప్పటినుంచి మళ్లీ దీన్ని పట్టించుకోలేదు. దీంతో డ్రెయిన్ పొడవునా గుర్రపుడెక్క, తూడు పెరిగి మురుగునీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. దారిపొడవునా మేటలువేయడంతో ఒక్కోసారి మేజర్ డ్రెయిన్‌దిశను మార్చుకుని రివర్స్‌ఫ్లో అవుతుండడంతో పంటపొలాలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆక్రమణలు.. మేటలు..

కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్ పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. అమలాపురం పట్టణంలోని చిన్నవంతెనవద్ద పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కొందరైతే డ్రెయిన్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలపై పందుల పెంపకానికి ప్రత్యేకంగా షెడ్లు నిర్మించుకున్నారు. మరికొందరైతే దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మేజర్ డ్రెయిన్ పలు వ్యాపార సంస్థలు, హోటళ్లకు డంపింగ్ యార్డుగా మారిపోయింది. రోజువారీ చెత్తను రాత్రివేళల్లో మేజర్ డ్రెయిన్‌లో డంపింగ్ చేసేస్తున్నారు. దీంతో చిన్నవంతెనవద్ద పెద్దఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయింది. నల్లవంతెన సమీపంలో శ్మశానవాటికను ఆనుకుని ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు చెత్త సైతం మేజర్ డ్రెయిన్ ప్రవాహానికి అవరోధంగా మారిపోయింది. ఇక ఆక్రమణల ప్రభావంతో మేజర్ డ్రెయిన్ కాస్తా చిన్నపంటబోదెలా పలుచోట్ల మారిపోయింది. అమలాపురం రమా థియేటర్ సమీపంలో నీటిపారుదలశాఖ అధికారులు ఈ స్థలం ఇరిగేషన్ శాఖకు సంబంధించినదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ సైతం చేశారు. అదే ఇరిగేషన్‌శాఖకు చెందిన భూమి నుంచే ఉప్పర్ల కాలనీకి బీటీ రోడ్డు నిర్మించారు. దీన్ని ఆనుకుని దారి పొడవునా మేజర్ డ్రెయిన్ ఆక్రమణలకు గురవుతున్నా ఆశాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆక్రమణలతోపాటు డ్రెయిన్‌లోని మేటల ను తొలగిస్తేనే మురుగునీరు సక్రమంగా ప్రవహిస్తుందని వారు చెప్తున్నారు. అమలాపురంలోని ఆక్రమణల ప్రభావంతో అమలాపురంరూరల్ మండలం నల్లమిల్లి, జనుపల్లి తదితర గ్రామాలతోపాటు అయినవిల్లి మండలం నేదునూరు తదితర గ్రామాల్లోని పంట పొలాలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. ఆయా గ్రామాల్లోని కాలనీలు సైతం కొద్దిపాటి వరదలు, వర్షాలకు ముంపులోనే గడపాల్సిన దుస్థితి ఏర్పడింది.

రూ.4.50కోట్లతో ప్రతిపాదనలు

కుమ్మరికాల్వ మేజర్ డ్రెయిన్ దుస్థితిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. డ్రెయిన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. నిధులు లేక గుర్రపుడెక్క, తూడు తొలగించలేదు. ప్రస్తుతం మేజర్ డ్రెయిన్ అభివృద్ధికి రూ.4.50కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ప్రస్తుత సీజన్‌లో నిధులు మంజూరు చేస్తే వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

-ఎంవీవీ కిశోర్, డ్రైనేజీశాఖ డీఈఈ

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారుల సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితోపాటు రెవెన్యూ డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోలు, మండలస్థాయి కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం 7

న్యూయార్క్‌ను సందర్శించిన అమలాపురం ఎంపీ

» పాక్ ఉగ్ర చర్యలను వివరించే భారత ప్రతినిధుల బృందంలో సభ్యుడిగా హాజరు



న్యూయార్క్ నగరంలో భారత ఎంపీల ప్రతినిధుల బృందంలో ఎంపీ హరీష్

అమలాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను ప్రపంచ దేశాలకు తెలియచేసే లక్ష్యంతో భారత్‌కు చెందిన ఎంపీల బృందం ఆదివారం యూఎస్‌లోని న్యూయార్క్ నగరానికి చేరుకుంది. డాక్టర్ శశిథరూర్ నేతృత్వంలో ఈబృందంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌తోపాటు మరికొందరు సభ్యులు న్యూయార్క్ నగరంలోని 2001లో జరిగిన అల్‌ఖైదా ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ట్విన్ టవర్స్‌ను పేల్చివేసిన ప్రాంతాన్ని సందర్శించి అక్కడి స్మారక చిహ్నాన్ని, మ్యూజియంను సందర్శించి నాటి ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ వైఖరిని ఎండగట్టారు. అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను దోషిగా చేసే లక్ష్యంతో ఈ పర్యటన చేస్తున్నామని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌కు బాసటగా ప్రపంచ దేశాలు నిలవాలని కోరారు. న్యూయార్క్‌లోని ప్రముఖ థింక్ ట్యాంక్స్ విద్యాసంస్థలు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రతినిధి బృందంతో చర్చలు జరిపినట్టు తెలిపారు. తర్వాత గయానా దేశానికి తమ బృందం పర్యటన సాగిస్తుందని ఎంపీ స్పష్టం చేశారు.

జిల్లావ్యాప్తంగా వర్షం

» ముమ్మిడివరంలో అత్యధికంగా 44.4 మి.మీ. వర్షపాతం


అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం పలుచోట్ల వర్షం కురిసింది. ముమ్మిడివరంలో అత్యధికంగా 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా మండపేటలో 1.2 మిల్లీమీటర్లు నమోదైంది. ఆదివారం జిల్లాలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 18 మిల్లీమీటర్లు, రాయవరం 2, రామచంద్రపురం 4, ఆలమూరు 9.4, రావులపాలెం 8.6, కొత్తపేట 4.2, కపిలేశ్వరపురం 2.2, ఐ.పోలవరం 4.2, అయినవిల్లి 8.8, పి.గన్నవరం 2, అంబాజీపేట 3.2, మామిడికుదురు 5.2, రాజోలు 4.6, మలికిపురం 9.6, సఖినేటిపల్లి 4.6, అల్లవరం 5.4, ఉప్పలగుప్తం 7.8, కాట్రేనికోన 7.4, అమలాపురంలో 17.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సత్యవాడలో అప్రమత్తం 7

గోదారి గుట్టు మీద గంపెడు అందాలే..

రాజమహేంద్రవరం గోదావరి గట్టు అంటేనే అందాలకు మారు పేరు. ఆ గట్టు మీద సాయం సమయాన సూర్యుడు అస్తమిస్తుండగా ఆ ఛాయలు గోదావరి మీద పడితే వర్ణ శోభితమే. దాన్ని చూసిన ఎవరైనా మనసు పారేసుకుంటారు. వెంటనే తమ ఫోన్లలో బంధించేందుకు ప్రయత్నించకుండా ఉండలేరు. ఆ దృశ్యాల్నే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..







ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు



పోటీలు ప్రారంభించి పవర్ లిఫ్టింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ పబ్లిక్ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంతైనా అభినందనీయమని, క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. వివిధ విభాగాల క్రీడా పోటీలను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులు ప్రారంభించారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్లు జంగా అబ్బాయివెంకన్న, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరాజు రాము, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, సూదా గణపతి పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి వందన



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న జగన్

విజేతల వివరాలు...

పోటీలు 3 విభాగాల్లో పది కేటగిరీల్లో హోరాహోరీగా జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా దొమ్మేటి వెంకటరమణ, డి.లక్ష్మీనారాయణ, డీఆర్కే నాగేశ్వరరావు, జి.వీరభద్రరావు, ఎ.బాలకృష్ణ, చిక్కం రాజబాబు వ్యవహరించారు. ఆయా విభాగాల విజేతలను జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పవర్‌లిఫ్టింగ్ 53 కిలోల మెన్ విభాగంలో వై.వీరబాబు (పి.గన్నవరం) ప్రథమ, జె.జితేంద్రదొర (అమలాపురం) ద్వితీయ, సీహెచ్.సంపత్ (కాకినాడ) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం), వై.మహేష్, పి.సతీష్ (కాకినాడ) వరుస స్థానాల్లో నిలిచారు. 66కిలోల విభాగంలో ఎం.జగన్ (కాకినాడ), ఎ.దుర్గాప్రసాద్ (ద్రాక్షారామం), బి.నానిబాబు (కాకినాడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. మహిళా విభాగంలో పిల్లి వందన (అమలాపురం) ప్రథమ, బి.అఖిల (రామచంద్రపురం) ద్వితీయ, బి.సింధు (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. మాస్టర్స్ విభాగంలో బి.అప్పన్న (అమలాపురం) ప్రథమ, డి.నాగేశ్వరరావు (రామచంద్రపురం) ద్వితీయ, ఏఎస్.ప్రసాద్ (అమలాపురం) తృతీయస్థానాలు సాధించారు.

సత్యవాడలో అధికారులు అప్రమత్తం

కరోనా కేసు నమోదుతో మెడికల్ క్యాంపు ఏర్పాటు, ఇంటింటా ఆరోగ్యంపై సర్వే



ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

కె.గంగవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో కరోనా కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర ఆదేశాలతో రామచంద్రపురం సబ్‌డివిజన్ అధికారి డాక్టర్ ప్రశాంతి, పామర్రు ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పోలిశెట్టి హర్షిత, డాక్టర్ పసుపులేటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సత్యవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే చేయించారు. అనారోగ్యం బారిన పడిన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని, కరోనా వైరస్ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతేక పారిశుధ్య నిర్వహణ నిర్వహించారు. కరోనా నిర్ధారణ అయిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. వైద్య శిబిరంలో సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఉప సర్పంచ్ సలాది శ్రీనివాసు పాల్గొన్నారు.

బాలబాలాజీ కల్యాణోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు ఆదివారం పందిరి రాట పాతడంతో ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణల మధ్య ఆదివారం సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు కల్యాణోత్సవాలకు శ్రీకారంచుట్టారు. వైశాఖ మాసం కృష్ణపక్షం త్రయోదశి అశ్వినీ నక్షత్ర శుభ ముహూర్తాన పందిరి రాటను పాతి ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు కలగకుండా ఉండాలని కోరారు. జూన్ 5 నుంచి 9 వరకు కల్యాణోత్సవాల సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 6న రాత్రి 9.15 గంటలకు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.



పందిరి రాట పాతుతున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు విజయరామ్

కాకినాడలో ఉమ్మడి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న విజయరామ్

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యకర సమాజానికి దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు, సేంద్రియ నిపుణుడు ఎం.విజయరామ్ పేర్కొన్నారు. ప్రకృతి రాగా సంస్థ అధినేత అజ్జరపు మల్లికార్జునరావు అధ్యక్షతన కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయరామ్ జ్యోతిప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు, పండ్లను పండించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవచ్చన్నారు. భూతాపాన్ని తగ్గించేందుకు, భవిష్యత్తు తరాల వారు రోగాల బారినపడకుండా రక్షించేందుకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా రసాయనాల వాడకం లేని పంట ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చన్నారు. పశు సంపదను రక్షించుకోకపోతే మానవాళికి భవిష్యత్తు ఉండదన్నారు. భూ సమతుల్యత, వైవిధ్యం కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యత అన్నారు. రాత్రి సమయాల్లో పశువులను తరలిస్తున్న వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో కెప్టెన్ మల్లికార్జునరావు దంపతులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఆకట్టుకుందన్నారు. భవిష్యత్తు తరాల వారు ఆరోగ్యకరంగా జీవించాలంటే సేంద్రియ వ్యవసాయం ప్రధానమన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, వ్యవసాయ విధి విధానాలు, గోమాత విశిష్టతను సమగ్రంగా వివరించారు. కెప్టెన్ మల్లికార్జునరావు అధ్యక్షోపన్యాసం, రాజమహేంద్రవరానికి చెందిన అంబటి శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. సదస్సులో వల్లూరి మధు, మైలవరపు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, సాగర్ రాజా, సంప్రదాయ వ్యవసాయదారులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులతో అల్పాహారం, భోజనం తయారుచేయించి అతిథులకు, సభికులకు వడ్డించారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

రెండు ఆవులకు గాయాలు



మృతిచెందిన లేగ దూడ

గోకవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ఒక లేగ దూడ మృతిచెందగా, గ్రామంలోని నాగులపాటి నారాయణకుమార్‌కు చెందిన రెండు ఆవులకు గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపార సహజవాయువు, చమురు నిక్షేపాలను రక్షించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్‌లో అపార సహజవాయువు, చమురు నిక్షేపాలు ఉన్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవ్ పిలుపునిచ్చారు. కేజీ బేసిన్‌లో లభ్యమవుతున్న చమురు, సహజ వాయువులపై రాష్ట్ర వాటాను సాధించుకునేందుకు సంఘటితంగా కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం చమురు, సహజవాయు ఖనిజాలు, ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు, వాటిని సంరక్షించేందుకు నిర్వహించిన సదస్సుకు సామాజికవేత్త ఆలపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్ల విలువైన సహజ వాయువు నిల్వలు రాష్ట్రాన్ని దాటి పోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. బాంబే హైలో కూడా లేని సహజ వనరులు కేజీ బేసిన్‌లో ఉన్నాయన్నారు. వాటిని ప్రైవేటు సంస్థలు తరలించబోతున్నాయని, దాని వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ప్రజలంతా ఏకమై సహజ వాయువు దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు కలసికట్టుగా చట్ట సభల్లో ప్రశ్నిస్తే రాష్ట్రానికి రావాల్సిన వాటా ఖచ్చితంగా దక్కుతుందన్నారు. గ్యాస్ పైపులైన్ల ఏర్పాటుతో రైతులు భూములు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రిలయన్స్ కార్యకలాపాల వల్ల తీరప్రాంతం వెంబడి తీరని నష్టం జరుగుతుందన్నారు. నష్ట నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవడంలేదని మహదేవ్ విమర్శించారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కొల్లా రాజమోహన్ మాట్లాడారు. సదస్సులో డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, వంటెద్దు వెంకన్నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు తదితరులున్నారు.

అంతర్వేదిలో కొండచిలువ హతం



అంతర్వేది దేవస్థానం గ్రామంలో స్థానికులు హతమార్చిన కొండచిలువ

అంతర్వేది, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఆదివారం ఉదయం కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక రాజుల అన్నదాన సత్రంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అన్నదాన సత్రానికి ఉన్న మంచినీటి సంపులోకి 2 మీటర్లు ఉన్న కొండచిలువ జారిపోవడంతో స్థానికులు చాకచక్యంగా పట్టుకునిహతమార్చారు.

‘లోవ’కు పోటెత్తిన భక్తులు

రూ.5.54 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో భక్తులు

తుని రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలలో బారులుతీరిన భక్తులు తల్లిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.54 లక్షల ఆదాయం సమకూరినట్టుఈవో పి.విశ్వనాథరాజు చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..



వధూవరులను ఆశీర్వదిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి దంపతులు

ప్రేమకు హద్దులు, సరిహద్దులు ఉండవు. అందుకు ఉదహరణగా నిలిచారు ఈ దంపతులు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన తుమ్మల అభి గత పదేళ్లుగా అమెరికాలోని సియోటెల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేస్తున్న కింబర్లీ అనే యువతితో పరిచయడం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. వారి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయి. దీంతో అబ్బాయి స్వగ్రామం పులిమేరులో ఆదివారం వారి వివాహం దీనిని హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. అమెరికా అమ్మాయి, ఆంధ్ర అబ్బాయి వివాహ వేడుకను చూసేందుకు జనం తరలివచ్చారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి హాజరై జంటను ఆశీర్వదించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)

ఎస్‌ఎంసీ చైర్మన్ మృతదేహం లభ్యం



తుల్యభాగ డ్రెయిన్‌లో లభ్యమైన సత్యం మృతదేహం

కరప, మే 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఎస్‌ఎంసీ చైర్మన్ కొలిశెట్టి సత్యం(42) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కొలిశెట్టి సత్యం స్థానికంగా బిర్యానీ సెంటర్ నిర్వహిస్తుండడంతో పాటు గొల్లపాలెం హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన సెల్‌లో మాట్లాడుతూ గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక్కసారిగా దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో కరప పోలీసులు, కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది, గజఈతగాళ్లు, స్థానిక మత్స్యకారులు తుల్యభాగ డ్రెయిన్‌లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాని విషయం పాఠకులకు విధితమే. ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్ సహకారంతో గాలింపు చేపట్టగా మట్లపాలెం వద్ద సత్యం మృతదేహం లభ్యమైంది. స్థానిక వీఆర్వో సమక్షంలో శవపంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్యభర్తల మధ్య ఏ ర్పడిన వివాదం కారణంగా సత్యం ఆత్మహత్య కు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. సత్యం మృతితో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనాస్థలి వద్ద కుటుంబసభ్యుల రోదనలతో పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కరప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చురీలో బిహార్ యువకుల మృతదేహాలు

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ వద్ద శనివారం లారీ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన బిహార్ యువకులు ధీరజ్‌కుమార్, చందన్‌కుమార్‌మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆదివారం పోస్టుమార్టం జరగలేదు. మృతుల కుటుంబీలకు శనివారం రాత్రే సమాచారం అందించినప్పటికీ వారు రాకపోవడం వల్లే పోస్టుమార్టం వాయిదా పడినట్టు తెలుస్తోంది. సోమవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబాలకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.





కోనసీమలో కూసింత సేపు కూత!

రావులపాలెం (ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాత వంతెన మీదుగా ట్రాలీ లారీపై రైల్ ఇంజన్ బోగీని ఆదివారం తరలించారు. తణుకు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న దీన్ని కొత్త వంతెన మీదుగా చూసిన వారు ఇదేంటి కోనసీమకు రైల్వే లైన్ వచ్చేసిందా, ఈ ట్రైన్ ఎప్పటి నుంచి రాకపోకలు సాగిస్తోందంటూ చమత్కరిస్తూ ఆసక్తిగా తిలకించి ఫొటోలు తీసుకున్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

సిద్ధి వినాయక ఆలయంలో భక్తుల రద్దీ

అయినవిల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళాలు: అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద ట్రస్టుకు పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కురిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ప్రత్యూష దంపతులు విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని అన్నప్రసాద్ ట్రస్టుకు రూ.50,409 విరాళం ఇచ్చారు. పేరూరుకు చెందిన ఉపాధ్యాయుల భానుప్రియ అన్న ప్రసాదానికి రూ.10,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన జి.పృథ్వీరాజ్, జ్యోతిర్మయి దంపతులు అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న అర్చకుడు

అగ్ని ప్రమాదంలో తాటాకిలు దగ్ధం

అంబాజీపేట, మే 25(ఆంధ్రజ్యోతి): దీపం నుంచి వచ్చిన నిప్పురవ్వలకు మంటలు చెలరేగి తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. కొల్లివారిపేటలోని కందేరి మంగాదేవి తాటాకింట్లో దీపం నుంచి వచ్చిన నిప్పురవ్వలకు ఒక్కసారిగా చేలరేగాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకూ నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.



అగ్ని ప్రమాదంలో ఆహుతైన తాటాకిల్లు

ట్యాంకర్ల ద్వారా తాగునీటి పంపిణీ

ఉప్పలగుప్తం, మే 25(ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ తిరుమల చెరువు వాసులు వారం రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో సర్పంచ్ కుంచే బుల్లియ్యకు తమ సమస్యను చెప్పడంతో ఆయన స్పందించారు. ట్యాంకర్ల ద్వారా తిరుమలచెరువుకు తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఆయన దగ్గరుండి నీరందేలా చర్యలు చేపట్టడంతో వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.ఏడుకొండలు, పంచాయతీ సభ్యులు డి.నరసింహమూర్తి, మధుర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలచెరువులో తాగునీటిని అందిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

నంద్యాల పరిశీలకుడిగా ఎమ్మెల్సీ రాజశేఖర్

ఐ.పోలవరం, మే 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడుకు జనసమీకరణ కోసం నంద్యాల జిల్లా పరిశీలకుడిగా ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ నియమితులయ్యారు. ఆయన నంద్యాల జిల్లాలో నాయకులను సమన్వయం చేసుకుంటున్నారు. కడప టీడీపీ మహానాడుకు అధిక సంఖ్యలో జనం వెళ్ళేలా నాయకులతో ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఆయన మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి కడపలో టీడీపీ మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు.



కడప జిల్లాలో టీడీపీ మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్

బాలబాలాజీని దర్శించుకున్న ఏపీఈపీడీసీఎల్ మెంబర్

మామిడికుదురు, మే 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామిని ఏపీ ఈపీ డీసీఎల్ మెంబర్ టీబీఎస్ మూర్తి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనాన్ని అందించారు. మూర్తి దంపతులకు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.



ఏపీఈపీడీసీఎల్ మెంబర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

వైభవంగా దాసాంజనేయస్వామి ఊరేగింపు

పి.గన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని లంకల గన్నవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ఊరేగింపు జరిగింది. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజల అనంతరం మధ్యాహ్నం స్వామివారిని ఊరేగించారు. ప్రత్యేక వాహనంపై స్వామి వారిని ఉంచి శక్తి వేషాలు, బాణసంచా కాల్పులతో ఆయా వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో స్థానిక యువత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లంకల గన్నవరంలో దాసాంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పి.గన్నవరం సీహెచ్‌సీలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు



సీహెచ్‌సీలో కొవిడ్ వార్డు ఏర్పాటు చేసిన దృశ్యం

పి.గన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జిల్లాలో కొవిడ్ కేసు నమోదు కావడంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. సీహెచ్‌సీ స్థాయి ఆసుపత్రుల్లో కొవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేస్తున్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్ ఆదేశాల మేరకు పి.గన్నవరం సీహెచ్‌సీలో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు. ఐదుగురు సరిపోయే విధంగా బెడ్‌లను సిద్ధం చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు తెలిపారు. కొవిడ్ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని భయపడాల్సిన పనిలేదని ఆయన చెప్పారు. జాగ్రత్తలు పాటిస్తే కరోనా దరిచేరదని తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు, మే 25(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో ఉన్న గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతరను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బుట్టబొమ్మలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణల మధ్య అమ్మవారి జాతరను ఘనంగా జరిపారు. సోమవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.

పెదపట్నం గ్రామదేవత మహాలక్ష్మమ్మ →



రేపు ఉద్యోగ మేళా

మలికిపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మలికిపురం డిగ్రీ కళాశాలలో 27న వన్ఎంవన్‌బి ఫౌండేషన్ సమన్వయంతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. గ్రాస్రూట్స్ డైరెక్టర్ అబిరామ్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధిని లక్ష్యంగా వన్ఎం ఎన్‌బి పనిచేస్తుందన్నారు. ఉద్యోగ మేళాలో ఏడు ప్రముఖ కంపెనీలు 300కు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, బిఫార్మసీ, ఎం.ఫార్మసీతో పాటు ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చునన్నారు.



ప్రత్యేక అలంకరణలో సోమాలమ్మతల్లి

సోమాలమ్మ జాతర

ఉప్పలగుప్తం, మే 25(ఆంధ్రజ్యోతి): చీకట్లపాలెం గ్రామదేవత సోమాలమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 27 వరకు వీటిని నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం సలాది నారాయణమూర్తి ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. నేటి రాత్రి గరగ నృత్యాలు, శక్తి వేషాలు, తీన్‌మార్, తోటపేట గ్యారడీ, బాణసంచా కాల్పులతో జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అమలాపురం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): దీపం బుడ్డి కారణంగా కాలిన గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. మృతురాలి కుమారుడు భీమవరపు సత్తిబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కామనగరువు శివారు కరక్కాయపేటలో ఉంటున్న వెర్రమ్మ (74) ఈ నెల 16న రాత్రి బుట్టకింద కోళ్లను పెట్టే క్రమంలో దీపంబుడ్డిపై ఆమె చీర పడటంతో నిప్పంటుకుంది. కాలిన గాయాలతో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఆమెకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఉన్నత వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

సుజిత్‌కు ఆర్థికసాయం

రాజోలు, మే 25(ఆంధ్రజ్యోతి): పాలగుమ్మికి చెందిన విద్యార్థి ఉల్లంపర్తి సుజిత్ ఇటీవల ఆపరేషన్ జరిగింది. సోంపల్లిలోని చిల్డ్రన్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. స్నేహితులు, స్కూలు స్టాఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ విద్యా సంస్థల కరస్పాండెంట్‌ల నుంచి రూ.70వేలను సేకరించి ఆదివారం విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశామని చిల్డ్రన్స్ స్కూలు కరస్పాండెంట్ అయ్యప్పనాయుడు తెలిపారు.

జనసేన పార్టీలో అందరికీ ప్రాధాన్యం కల్పిస్తాం

అంబాజీపేట, మే 25(ఆంధ్రజ్యోతి): జనసేన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అధిక ప్రాధాన్యం కల్పిస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటలో ఆ పార్టీ నాయకుడు కొర్లపాటి గోపి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే తెలిపి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా గోపిని పలువురు కూటమి నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా నానాజీ



ఉప్పలగుప్తం, మే 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఉప్పలగుప్తం మండలాధ్యక్షుడిగా గొల్లవిల్లి మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ ఎన్నికైనట్టు ప్రకటించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అరిగెల నానాజీ వరుసగా రెండవసారి పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు నానాజీ స్వగృహానికి వచ్చి ఆయన్ను అభినందించారు. పార్టీ మండల కార్యదర్శిగా కూనవరం మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని నానాజీ అన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

మలికిపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మోరి పుంతలో ముసలమ్మగుడి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శోభాయాత్ర నిర్వహించి ఆయా వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

నీరు ఇలా ఉంటే..బయటకు వెళ్లేదెలా?

• అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు • పట్టించుకోని యంత్రాంగం

ముమ్మిడివరం, మే 25(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తుండటంతో ఆయా ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ ఎత్తులో రోడ్డు ఉండడం, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి దోమలు, ఈగలతో ఆయా ప్రాంతవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బాలయోగి కాల్వగట్టు రోడ్డులోని ఒకవీధిలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని స్థానికులంటున్నారు. ఈ వీధిలో సుమారు 20 కుటుంబాలు నివశిస్తున్నారు. ఈ రోడ్డును 20 ఏళ్ల క్రితం నిర్మింప చేశారు. రోడ్డు పల్లంగా ఉండడంతో పాటు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం, ఇళ్లలోని వాడకం నీరు రోడ్డుపై చేరడంతో అపారిశుధ్యంతో మరింత ఇబ్బందులు తలెత్తు తున్నాయని వారంటున్నారు. డ్రైనేజీ సౌకర్యం కల్పించి రోడ్డును ఆధునికీకరించాలని ఆ ప్రాంతానికి చెందిన పీవీఎస్ వర్మ, నల్లపరాజు శ్రీనివాసరాజు, కొండవీటి ద్రోణేశ్వరరావు, గుద్దడి రాజేంద్రప్రసాద్‌లతో పాటు పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

రోడ్లపైనే పశువులు..వ్యాపారులకు పాట్లు

కాట్రేనికోన, మే 25(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనలోని పలు ప్రధాన రహదారిపై పశువులు తిష్ఠవేసి వాహనదారులకు ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఆబోతుల పోట్లాటలో పలువురు గాయపడిన ఘటనలున్నాయి. కాట్రేనికోన గేట్ సెంటర్‌లో ఒక మేక బైక్‌కు అడ్డురావడంతో చెయ్యేరు గ్రామానికి చెందిన వీఆర్వో తీవ్రంగా గాయపడి మరణించారు. గతంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ పశువులను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. దీనితో వాటి యజమానులు పశువులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు. తర్వాత కొన్నాళ్ళకు పాత కథే పునరావృతమయ్యింది. పశువులు దుకాణాల్లోకి చొచ్చుకుని రావడంతో నష్టపోతున్నామని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్లపై తిరిగే పశువులను లైట్‌హౌస్, కరవాక వంటి ప్రాంతాలకు తరలించాలని పలువురు సూచిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాట్రేనికోనలోని గేట్ సెంటర్‌లో రోడ్డు పక్కన తిష్టవేసిన పశువులు



రాజోలులో భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన నిత్యను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా తదితరులు

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

రాజోలు, మే 25(ఆంధ్రజ్యోతి): రాజోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అహల్యాబాయి హోల్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మైసూర్‌లోని దత్తపీఠం సచ్చిదానందస్వామి నిర్వహించిన భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన నారంభట్ల నిత్యను ఆయన అభినందించి శివాజీ మహరాజ్ ప్రతిమను బహుమతిగా అందజేశారు. రాజోలు ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కాసు భవానీ, సెక్రటరీ కొత్త పద్మావతి ఎస్.నిత్యకు పట్టువస్త్రాలు బహూకరించారు. రాజోలు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, వీహెచ్‌పీ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, రాజా నాగరత్నకుమార్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, అడబాల రాంబాబు, చెల్లింగి త్రినాథరావు, చలువాది త్రినాథ్, కాసు సతీష్, కాసు సతీష్, మేడిచర్ల చాణక్య, దేవళ్ల మాణిక్యాలరావు, చింతా ప్రసాద్ ఆర్యవైశ్య మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో అభయాంజనేయస్వామి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా ఆంజనేయస్వామి శోభాయాత్ర

ముమ్మిడివరం, మే 25(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని పోలమ్మ చెరువుగట్టు, నగర పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న అభయాంజనేయస్వామి శోభాయాత్ర ఆదివారం వైభవంగా సాగింది. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 22న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నాటి శోభాయాత్రతో ముగిశాయి. ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఆయా వీధుల్లో తీన్మార్ వాయిద్యాలు, బుట్టబొమ్మల వేషధారణలు, బాణసంచా కాల్పులతో ఆయా ప్రాంతాల్లో ఊరేగించారు. నగర ప్రముఖులంతా శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీరామ చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు జరిపించి మధ్యాహ్నం శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో తాడి నరసింహరావు, ఎం.బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, కె.రామలింగేశ్వరరావు, గంజి జాజి, సరిపెల్ల శ్రీనివాసరాజు, పేరిచర్ల వాసురాజు, వెత్సా వీరేష్, సి.వెంకటేశ్వరరావు, సుతాపల్లి అజయ్ కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామస్వామి దంపతుల విగ్రహాలకు పలువురు నివాళి

మామిడికుదురు, మే 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ వ్యవస్థాపకుడు దివంగత మొల్లేటి రామస్వామి జయంతిని అప్పనపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఆలయం పక్కనే గల రామస్వామి దంపతుల విగ్రహాలకు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు బొక్కా సత్యంమూర్తి, రామస్వామి కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అప్పనపల్లి ఆలయ నిర్మాత రామస్వామి దంపతుల విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

మురమళ్ల తాగునీటి చెరువులో చేపలు మృత్యువాత

ఐ.పోలవరం, మే 25(ఆంధ్రజ్యోతి): మురమళ్ల తాగునీటి ప్రాజెక్టు చెరువులో చేపలు చనిపోవడంతో దుర్వాసన వస్తోంది. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం పక్కనే ఉన్న చెరువులో చేపలు చనిపోయి రెండు రోజులు కావస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి చెరువులో చేపలు చనిపోయి తేలియాడుతుంటే వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మురమళ్ల మంచినీటి ప్రాజెక్టు చెరువులో మృతి చెందిన చేపలు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.94లక్షలు

ఆత్రేయపురం, మే 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తజనం అష్టోత్తరపూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,94, 639 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పెదకాకానికి చెందిన కొండ్రగుంట రవి, వరమల్లేశ్వరి దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు.



వ్యాఘ్రేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం

అంబాజీపేట, మే 25(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుల్లేటికుర్రులోని బాలాత్రిపుర సుందరీ సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ఆల యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, మే 25(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకుని మురమళ్ళ వీరేశ్వరస్వామికి ఆదివారం లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ సహాయ కమీషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాగాభట్ల శ్రీరామ్‌శర్మ, నాగాభట్ల కిషోర్‌శర్మ పాల్గొన్నారు.



స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎన్నికైన వెంకట శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

స్టాండింగ్ కౌన్సిల్ శ్రీనివాసరావుకు సత్కారం

ముమ్మిడివరం, మే 25(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన కోన వెంకట శ్రీనివాసరావును పలువురు సత్కరించి అభినందించారు. మాజీ ఏజీపీ సీనియర్ న్యాయవాది వెంకటశ్రీనివాసరావు నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమింపబడిన విషయం విదితమే. స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన ఆయన్ను చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైసీపీ రాష్ట్ర నాయకుడు పెన్మెత్స చిట్టిరాజు, కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్, మట్ట సత్తిబాబు, పళ్ల వీరబాబులతో పాటు పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు.



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు తథ్యం

మామిడికుదురు, మే 25(ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు తథ్యమని మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన కొల్లాబత్తుల మహలక్ష్మిని గొంది గ్రామంలో ఆదివారం సన్మానించారు. గొంది గ్రామంలో కె.శ్రీను ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మహలక్ష్మికి రూ.10వేలు ప్రోత్సాహంతో పాటు మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో కె.అశోక్‌కుమార్, శ్యామ్‌బాబు, విజయ్‌కుమార్, నాని, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

అపూర్వ విద్యార్థుల కలయిక



గంగవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కె.గంగవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2002- 2003 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులంతా ఒకచోట కలుసుకున్నారు. దీనిలో భాగంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నాటి గురువులు 12 మందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రక్షి. బ్రహ్మానందం, నాటి విద్యార్థులు కోటిపల్లి బాల వెంకటేష్, వనసల ప్రసాద్‌రావు, చుండ్రు జగదీశ్వరి దేవి, అనూరి వెంకటరమణ, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ ఉద్యోగుల సమ్మె



దీక్షలో పాల్గొన్న మున్సిపల్‌శాఖ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగులు

మండపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు తమ న్యాయ బద్ధమైన కోర్కెలు తీర్చాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ పథకాలూ వర్తింపచేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగపు సంఘ నేతలు కప్పల అన్నవరం, తలాటి వెంకన్న, కప్పల సురేంద్ర, పాలపర్తి సురేంద్ర, పిట్టా ప్రవీణ్‌కుమార్, గంటి నవీన్‌కుమార్, ఖండవల్లి రాజు, మత్తాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముురుగుకాలువ పూడికతీత పనులు ప్రారంభం



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కపిలేశ్వరపురం-టేకి మురుగు కాలువ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, మాచర నీటిసంఘం అధ్యక్షుడు కొరపాటి జానకి రామయ్య, తాతపూడి నీటి సంఘం అధ్యక్షుడు మేకా శ్రీరామకృష్ణ ప్రారంభించారు. రూ. నాలుగు లక్షల అంచనా వ్యయంతో సుమారు మూడు కిమీ మేర ఈ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామమాజీ సర్పంచ్ ఎంఎస్‌వీ ప్రసాద్, నీటిసంఘం డైరెక్టర్లు, మాజీ ఏఎంసీ చైర్మెన్ పువ్వల చిట్టిబాబు, మాజీ డీసీ చైర్మెన్ వంటిపల్లి అబ్బు, బీజేపీ నాయకుడు నామాల శ్రీనివాస్, ఇరిగేషన్ డ్రైన్స్ అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు రాయవరంలో ధ్యాన శిబిరం

రాయవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాయవరం సత్యసాయి సేవా మందిరంలో ఈనెల 27న ఉచిత ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంటుందన్నారు.

రేషన్ ఎండీయూ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం



ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సత్కరిస్తున్న డీలర్లు

మండపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటా రేషన్‌పేరిట ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను రద్దుచేసి, తిరిగి పాత విధానంలో రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవటంపై మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మండపేట రూరల్ అర్బన్ డీలర్లు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ విధానం వల్ల అక్రమాలు చోటుచేసుకోవని వారంతా అన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం ప్రతినిధులు గోశాలప్రసాద్, బత్తుల గణపతి, మామిడిశ్రీను, రామిశెట్టి వీర్రాజు, టి.అచ్యుతరావు, అనురాధ, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎప్పుడూ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త కొమ్మిశెట్టి సత్తిబాబు ఇటీవల మరణించటంతో ఆ కుటుంబానికి మంజూరైన రూ. 5 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మచ్చా నాగబాబు, ఉంగరాల రాంబాబు, 15వ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్, కాశీనకాశీ, వాదాప్రసాదరావు, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు, పూజలు



రాయవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): వెంటూరు ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో జయంతి ఉత్సవాలు సందర్భంగా నాలుగోరోజైన ఆదివారం అభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు. ఆలయ అర్చకుడు మద్దిరాల సాయికిరణ్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలాచార్యులు పాల్గొని స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, సహస్రనిమ్మకాయలతో పూజలు, సింధూరపూజ, నాగావళిదళ అర్చనలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముత్యాల వీరబాబు, చుండ్రు రవికుమార్, మాటూరి వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో

రాయవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో అందించేందుకుగాను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్‌కు ఆదివారం చేరాయి. ఈ పుస్తకాలను ఎంఈవో-2 వై.సూర్యనారాయణ పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ ఇప్పటివరకు 3,156 పుస్తకాలు వచ్చాయన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

• ఆందోళనలో వాహనదారులు, రైతులు • పట్టించుకోని అధికారులు



రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారిన కల్వర్టు

రాయవరం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక-నదురుబాద పీఆర్ రోడ్డులో ఉన్న కల్వర్టుకి రక్షణగోడలు లేక ప్రమాదంగా మారింది. వెదురుపాక శివారు లలితా విజయ దుర్గ అమ్మవారి ఆలయ సమీపంలో గొడ్డు కాలువపై కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడ లేకపోవడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వెదురుపాక, నదురుబాద గ్రామాల మీదుగా రామచంద్రపురం వెళ్లే వాహనదారులు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పంట కోతల సమయంలో ధాన్యం తీసుకు వచ్చే వాహనాలను రైతులు ఈ వంతెనపై ప్రయాణించాల్సి ఉంటుంది. వంతెనను ఆనుకుని మలుపు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. గత వైసీపీ పాలనలో నదురుబాద రోడ్డుతో పాటు ఇక్కడి కల్వర్టును పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారిందని స్థానికులతో పాటు వాహనదారులు అంటున్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి పూజలు



వెంటూరు సోమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు పార్వతీసమేత సోమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాసశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. పిండిప్రోలు నారాయణమూర్తి కుటుంబ సభ్యుల సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో తొలుత సోమేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకాలు, అనంతరం లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, దూపసేవ, లింగార్చనలు, సూర్యనమస్కారాలు, శాంతి హోమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో తటవర్తి రాఘవరాజు, దువ్వూరి శ్రీరామశర్మ, వాడ్రేవు వెంకట్రావు, వింజమూరి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్ రద్దుపై హర్షం



ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న లారీ యూనియన్ సంఘ నాయకులు

మండపేట,మే 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాహనాలకు గ్రీన్ ట్యాక్సు రద్దు చేయటంపై మండపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సారథ్యంలో యూనియన్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2019కు ముందు గ్రీన్‌ట్యాక్స్ రూ. 200 ఉండగా. వైసీపీ ప్రభుత్వం రూ. 20 వేలు చేసిందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం ప్రభుత్వం ఆ ట్యాక్స్‌ను రూ.1500 నుంచి రూ. 3000 చేసిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కావురి వీర్రాజు, రెడ్డి వీరన్న, గుత్తుల గోవింద్, రేలంగి శివ, రావూరి శ్రీనివాస్, కొండ, సంకాబత్తుల వెంకన్న, ఇంటి కృష్ణ, గుత్తుల బాబీ, కేతా దుర్గాప్రసాద్, గంజానాగు, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువల తవ్వకాలతో రైతులకు ప్రయోజనాలు

• సాగునీటి సంఘాల డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, డ్రైన్స్ డీఈ పోచారావు



గుమ్మిలేరు వద్ద తవ్వకాలు చేస్తున్న నర్సిపూడి మీడియం డ్రైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఆలమూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పంటభూములకు సాగునీటి కాలువలు ఎంత ముఖ్యమో మురుగునీటి కాలువలకు అంతే ప్రాధాన్యం ఉంటుంది. మురుగునీటి కాలువలు సక్రమంగా ఉంటే అధికవర్షాల సమయంలో పంటలు ముంపునకు గురికాకుండా మేలు జరుగుతుందని ఆలమూరు సాగునీటి సంఘాల డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి, డ్రైన్స్ డీఈ పోచారావు అన్నారు. ఆలమూరు మండలంలో గుమ్మిలేరు, పెనికేరులలో జరుగుతున్న తవ్వకాలను మురుగునీటి కాలువలను ఆదివారం డీఈ పోచారావు, ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. నర్సిపూడి మిడియం డ్రైన్ ఆధునీకరణకు రూ.17లక్షల నిధులు నీటిపారుదలశాఖ నుంచి మంజూరుకావడంతో ఆమేరకు గత వారం రోజులుగా తవ్వకాలు డీసీ అధ్యక్షుడు మెర్లగోపాలస్వామి ఆధ్వర్యంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను పరిశీలించి రైతులకు ఈడ్రైన్ తవ్వకం వల్ల మేలు జరుగుతుందని వారు అన్నారు. అనంతరం జొన్నాడ-పెనికేరు గ్రామాల మధ్య ఉన్న డ్రైన్ తవ్వకాలు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతుల సహకారంతో చేపట్టిన ఆధునీకరణ పనులను డీఈ పోచారావు, ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈడ్రైన్ రికార్డులలో లేదని, అయితే డ్రైన్ తవ్వకాలు చేసుకోవడంవల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అందువలన రికార్డుచేసే విధంగా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. రైతుల సహకారంలో పనులు చేపట్టడం అరుదుగా జరుగుతుంటాయని ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు గారపాటిని వారు అభినందించారు.

రేషన్ డీలర్ల హర్షం



ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరిస్తున్న రేషన్‌డీలర్లు

ఆత్రేయపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దు చేయడంపై రేషన్‌డీలర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆత్రేయపురం మండలానికి చెందిన రేషన్‌డీలర్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరించారు. ప్రభుత్వం రేషన్‌డీలర్లకు న్యాయం చేసిందని వారంతా హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జి.రామకృష్ణ, పట్నాల నాగరాజు, కె.సతీష్, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంచార వాహనం

● రూ.లక్షల విలువగల వాహనాన్ని వదిలేశారు

ఆలమూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రూ.లక్షల విలువగల వాహనాలను సక్రమంగా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నా యి. ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి(సీహెచ్‌సీ)వద్ద ఆధునిక సదుపాయాలతో తయారు చేయించిన సంచార వాహనాన్ని ఇలా వదిలేశారు. 2018 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో ప్రజల వద్దకు వైద్య సేవలు తీసుకురావాలనే లక్ష్యంతో అప్పట్లో చంద్రన్న సంచార వాహనాలను ప్రవేశపెట్టారు. ఈవాహనంలో పలు ఆధునిక సదుపాయాలు ఏర్పాటుచేసిన అక్కడే పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించే విధంగా ఈ వాహనాన్ని రూపొందించారు. 2019లో ప్రభుత్వం మారడంతో వాటిని మూలన పడేశారు. ఇంత ఆధునిక వాహనాలను మరో రకంగానైనా ఉపయోగించి ఉంటే బాగుండేది. ఎందుకూ పనికిరాకుండా వదిలేయడంవల్ల నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గుర్తించి ఇటువంటి వాహనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న సంచార వాహనం

గోకులం షెడ్లు నిర్మించారు.. నిధులు ఏవి.?



ఆత్రేయపురం మండలం కట్టుంగలో నిర్మించిన గోకులం షెడ్

ఆత్రేయపురం, మే 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలనే దృక్పథంతో ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తొలి విడతగా గోకులం షెడ్లు నిర్మించేందుకు దరఖాస్తులు కోరి మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని రైతులు ఎంతో ఉత్సాహంగా తమ పంటపొలాల్లో గోకులం షెడ్లను నిర్మించుకున్నారు. ఏడు నెలలు కావస్తున్నా రైతుల ఖాతాలలో నిధులు జమకాలేదు. ఉదాహరణకు ఆత్రేయపురం మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 45 మంది పాడి రైతులు దరఖాస్తు చేసుకోగా 43 మంది రైతులను ఎంపిక చేశారు. ఉపాధి నిబంధనల ప్రకారం గోకులం షెడ్లను నిర్మించారు. రైతులు అప్పులుచేసి గోకులం షెడ్లను నిర్మించారు. ప్రస్తుతం నిధులు మంజూరుకాకపోవడంతో వారంతా ఆయోమయంలో పడ్డారు. ప్రభుత్వం నిధులు మంజూరు కోసం గోకులం షెడ్లను నిర్మించుకున్న వారు ఎదురుచూస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.5.94లక్షలు



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టోత్తర పూజలు, వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తరపూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,94, 639 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదా న భవననిర్మాణానికి పెదకాకానికి చెందిన కొండ్రగుంట రవి-వరమల్లేశ్వరి దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక



జడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ద్రాక్షారామ, మే 25(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదకరంగా జరిగింది. 2002-2007 సంవత్సరాల మధ్య ఆరవ తరగతి నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడు అరవ విస్సు సూచనతో పాఠశాలకు 4సీసీ కెమెరాలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోట కృష్ణమూర్తి, అరవ విస్సు, దూబ బాబి, పి.రామకృష్ణ, అరుంధతి, బాపిరాజు, సత్యవేణి తదితరులు పాల్గొనగా కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు మణికంఠ, ప్రసాద్, లక్ష్మణ్, కోటిపల్లి ప్రసాద్, అంబిక, తులసి తదితరులు పర్యవేక్షణలో జరిగింది.

పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణపతకం సాధించిన రాంబాబు

ద్రాక్షారామ, మే 25(ఆంధ్రజ్యోతి):అమలాపురంలో జరిగిన 3వ తూర్పు, పశ్చిమగోదావరి పవర్‌లిఫ్టింగ్, బెంచి ప్రెస్ పోటీల్లో మాస్టర్ కేటగిరీ బెంచ్‌ప్రెస్‌లో వెలంపాలెం గ్రామానికి చెందిన పిల్లి రాంబాబు స్వర్ణ పతకం సాధించాడు. దొమ్మేటి నాగేశ్వరరావు పవర్‌లిఫ్టింగ్ మాస్టర్ కేటగిరీలో ద్వితీయస్థానంలో నిలిచాడు. తోటపేటకు చెందిన అల్లం దుర్గాప్రసాద్ అలియాస్ నాని 66 కేజీల జూనియర్స్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్, ఉప్పుమిల్లికి చెందిన సి.హెచ్.దుర్గాప్రసాద్ 59కేజీల బెంచిప్రెస్ కేటగిరీలో సిల్వర్‌మెడల్, మాస్టర్స్ బెంచి ప్రెస్ విభాగంలో అన్నాయిపేటకు చెందిన నక్కా భీమశంకరం రజితపతకం సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. విజేతలను వీరభద్ర వ్యాయామ కళాశాల అధినేత పొట్టిపోతుల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుడాల లక్ష్మీనారాయణ, అడవికుమార్, అనిశెట్టి అప్పారావు, దంగుడు బియ్యం కన్నబాబు, మీసాల బాలరాజు తదితరులు అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న రామకృష్ణ

మహానాడు ఏర్పాట్లలో మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),మే 25(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరుగనున్న తెలుగుదేశం మహానాడు ఏర్పాట్లలో మంత్రి సుభాష్ గత కొన్నిరోజులుగా నిమగ్నమయ్యారు. మంత్రి సుభాష్‌ను డెకరేషన్, శానిటేషన్ కమిటీ కన్వీనర్‌గా నియమించిన నేపథ్యంలో మహానాడు ప్రధానవేదిక, ఫోటో గ్యాలరీ, స్వాగత ద్వారాలు, అదేవిధంగా శానిటేషన్‌పై కమిటీ సభ్యుడు స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి, ఇతర సభ్యులతో కలసి చర్చించి పర్యవేక్షించారు. పనులు పరిశీలించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపు యజమానులు నిబంధనలు పాటించాల్సిందే

● ఎక్సైజ్ సీఐ కాత్యాయని

కొత్తపేట, మే 25(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొబిషన్ అండ్‌ఎక్సైజ్ పరిధిలో ఉన్న 27 మద్యంషాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేస్తూ మద్యం విక్రయాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ మాత్రమే జరపాలన్నారు. సిబ్బందిని తనిఖీలు నిమిత్తం నియమించామన్నారు. రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

హనుమాన్ శోభాయాత్ర

మలికిపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మోరిపుంతలో ముసలమ్మ గుడి వద్ద కొలువుదీరిన ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శోభాయాత్ర నిర్వహించి గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు.